

అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శుక్రవారం 10 నవంబర్ 2023 పేజీలు : 04


# సత్యసాయి జయంతి ఉత్సవాలకు యుద్ధప్రాతిపదిక చర్యలు తీసుకోండి

- మౌళిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలిన - జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిలు

**శ్రీసత్యసాయిజిల్లా, నవంబర్ 09, ప్రభాతవార్త ప్రతినిధి:**

శ్రీసత్యసాయి బాబా జయంతి వేడుకలకు ఏర్పాట్లను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, పుట్టపర్తి శాసనసభ్యులు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిలు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం ఉదయం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరం నందు జిల్లా సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్, డిఆర్‌కొండయ్య, మున్సిపల్ ఛైర్మన్ తుంగా ఓబుళపతి, ట్రస్ట్ ప్రతినిధులు చీఫ్ సెక్యూరిటీ అధికారి సి.వి.వాసుదేవన్, హెచ్‌ఆర్‌సి నారాయణ ప్రభు, తదితరులతో కలసి వేడుకల నిర్వహణకై చేపట్టవలసిన ముందస్తు చర్యలను చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సత్యసాయి జయంతి వేడుకలను విజయవంతం చేసేందుకు ఇప్పటి నుండి ప్రణాళికలు రూపొందించుకోవాలని కోవిడ్ తరవాత ప్రపంచ వ్యాప్తంగా ఈవేడుకల్లో పాల్గొనేందుకు దేశ విదేశీభక్తులు పెద్దఎత్తున విచ్చేసే అవకాశాలు ఉన్నాయన్నారు. వివిఐపిల ప్రోటోకాల్, రవాణా, పోలీసు భద్రత, విద్యుత్, తాగునీటి వసతి కల్పన, అత్యవసర వైద్యసేవలు, పారిశుద్ధ్యం తదితర ముఖ్యమైన అంశాలపై దృష్టి సారించాలని, రవాణాకు సంబంధించి మంచి కండిషన్‌గలబస్సులనువేయాలని ఆర్‌టిసి ఆర్‌ఎంను ఆదేశించారు. రవాణా శాఖ ప్రముఖులకు కాన్వాయ్ ఏర్పాటు, మెబైల్‌టీంలను ఏర్పాటు చేసి ప్రయాణికులు ప్రయాణించే బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల రద్దీ, ఓవర్‌లోడ్ లేకుండా పర్యవేక్షించాలన్నారు. అవసరం మేరకు పోలీస్ సిబ్బందితో పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలు తలెత్తకుండా చూడాలని, గణేష్‌గేట్, గోపురం, వెస్ట్‌గేట్, శాంతిభవన్, సాయికుల్వంత్, భోజన సముదాయాల శిబిరాలు, ప్రశాంతి నియలం పరిసర ప్రాంతాల లోపల, బయట గట్టిబందోబస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రశాంతినిలయంలో నిరంతరం త్రాగునీటి వసతి, విద్యుత్‌సరఫరా, ఖచ్చితంగా కొనసాగించాలని, రైల్వేస్టేషన్ సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, గోకులంక్రాస్, ఆర్‌టిసి బస్టాండ్, తదితర జనసమూహప్రాంతాల్లో ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో సమాచార కేంద్రాలు ఏర్పాటుచేయాలన్నారు. పర్యటకులు విహరంచే బోటింగ్ బోట్లను కండీషన్లో ఉంచుకోవాలని, ఓవర్‌లోడ్ ఉండకూడదని, రిస్క్‌బోట్లను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అధికారులందరూ సమన్వయ సహకారాలతో వేడుకలను జయప్రదంచేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, కలెక్టర్, ఎస్‌పిల ఆదేశాలను తూ.చ.తప్పకుండా పాటించాలని, ఈ నెల 18 నుండి 24వ తేదివరకు జరిగే వేడుకల్లో ప్రభుత్వ యంత్రాంగం పూర్తిస్థాయిలో సహకారాలు అందించాలని కోరారు. రెవెన్యూ, పోలీస్, మున్సిపల్,పుడా,పంచాయతీరాజ్,రోడ్లు భవనాలు, విద్యుత్, గ్రామీణ నీటిపారుదల, వైద్యఆరోగ్య తదితర శాఖలు సమన్వయంతో రోడ్లు, డ్రైనేజీ, ఇతర మరమ్మత్తుల పనులను పెండింగ్ లేకుండా వెంటనే పూర్తిచేయాలని సూచించారు. రోడ్లపైకి డ్రైనేజీ,మురుగునీరు, వర్షపునీరు నిల్వలు లేకుండాచర్యలు తీసుకోవాలని, పుట్టపర్తికి నలువైపులా పారిశుద్ధ్య పనులు చేపట్టడంతో పాటు, వీధిలైట్లుఏర్పాటుచేయాలని,గంజాయి,మద్యం తదితర వాటిని పూర్తిగా నిషేధించాలన్నారు. భద్రతాపరమైనచర్యలు, వైద్యశిబిరాలు, 108, 104 వాహనాల ఏర్పాటు, మొబైల్ టాయిలెట్స్, బారికెడ్ల ఏర్పాటు, ప్రముఖులకు భోజనవసతి, తదితర వాటిపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పుటపర్తి ఎస్‌డిపిఓ ఆర్.వాసుదేవన్, ఆర్‌డిఓ భాగ్యరేఖ, డ్వామా పిడి రామాంజినేయులు, డిఆర్‌డిఎ పిడి నరసయ్య, ఆర్‌టిసి ఆర్‌ఎం మధుసూధన్, డిఎంహెచ్ఓ డా.ఎస్.వి.కృష్ణారెడ్డి, డిసిహెచ్‌ఎస్ డా.తిప్పేనాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఇ రషీద్ ఖాన్, డిపిఓ ఇన్‌చార్జ శివకుమారి, మున్సిపల్ కమీషనర్ శేషన్న, పంచాయతీరాజ్ ఎస్ఇ గోపాల్ రెడ్డి, ట్రాన్స్‌కో అధికారి కరుణాకర్, విద్యుత్‌శాఖ డిఇ మోసెస్, మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, మైనింగ్, ఇరిగేషన్ గంగాధర్, టూరిజం శాఖ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, ప్రొవిజన్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఉమామనోహార్ రాజు, తహశీల్దార్ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# కరువు కోరల్లో రైతాంగం - సంక్షేమం పేరుతో జగన్ దోపిడి

- రైతు భరోసా కేంద్రాలు నిరాశ కేంద్రాలుగా మారాయి
- రైతుల ఆత్మహత్యల్లో జాతీయస్థాయిలో రాష్టం మూడవ స్థానం
- కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ తులసిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ తులసిరెడ్డి

**ముదిగుబ్బ, నవంబర్ 9 ప్రభాతవార్త**

రైతు ప్రభుత్వమని చెప్పుకునే వైసిపి ప్రభుత్వం గడిచిన నాలుగున్నర ఏళ్లలో రైతులను నట్టేట ముంచిందని సంక్షేమాన్ని సంక్షోభంలోకి వైసిపి ప్రభుత్వం నెట్టేసిందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన ముదిగుబ్బలో స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు రక్కసి కరాళనృత్యం చేస్తుంటే జగన్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉలుకు పలుకు లేకుండా కుంభకర్ణుని నిద్ర మత్తులో వున్నట్లు వుందన్నారు. అక్టోబర్ 1న ప్రకటించిన కరువు మండలాల్లో కేవలం 72 మండలాలను మాత్రమే కరువు మండలాలుగా ప్రకటించి చేతులు దులుపుకుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదై కరువును తలపిస్తోందని రాష్ట్రంలోని 18 జిల్లాల్లో 448 మండలాల్లో కరువు వుంటే 72 మండలాలను కరువు మండలాలు ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ పార్టీ తరుపున వైసిపి ప్రభుత్వానికి రాష్ట్రంలోని 18 జిల్లాల్లో వున్న అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెట్టుబడి సాయం కింద రైతులకు ఏడాదికి 12,500 రూపాయలు ఇస్తానన్న ప్రభుత్వం దానికి కట్టుబడి వుండలేదన్నారు. అదేవిధంగా ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ధరల స్థిరీకరణ ఏర్పాటు చేస్తామని రైతులను మోసం చేసిందన్నారు. అదేవిధంగా ప్రతి నియోజకవర్గంలో ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని అది కూడా మరిచిపోయి చివరికి తన నియోజకవర్గమైన పులివెందులలో కూడా ఏర్పాటు చేయలేని దుస్థితిలో జగన్‌రెడ్డి వున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలు నిరాశ కేంద్రాలుగా ఏర్పాటు చేశారన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో ఏ ఒక్క రైతుకు లబ్ది చేకూరింది లేదన్నారు. అదేవిధంగా జగన్‌రెడ్డి సున్నా వడ్డీ పథకానికి సున్నా చుట్టి పావులా వడ్డీకి పాడె కట్టారన్నారు. రాబోయే రోజుల్లో వైకాపా ప్రభుత్వం మాడి మసైపోతుందన్నారు. ఆత్మహత్యల్లో రాష్ట్రం మూడవ స్థానంలో వున్నా ఈ ప్రభుత్వానికి కళ్లకు గంతలు కట్టినట్లు వుందన్నారు. అభివృద్ధిపై మాట్లాడుతూ రామాయణాన్ని కట్టె, కొట్టె, తెచ్చె అన్న చందంగా తెచ్చిన అప్పులకు అభివృద్ధి శూన్యమన్నారు. సంక్షేమ పథకాలకు పాతర వేసి సంక్షోభంలోకి నెట్టారన్నారు. వ్యవసాయ రంగానికి సాగునీటి రంగం నిర్లక్ష్యంగా ఉదాహరణగా అన్నమయ్య ప్రాజెక్ట్, గుండ్లకమ్మ ప్రాజక్టే అన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో ఒకపక్క నిరుద్యోగం విలయతాండవం చేస్తుంటే పరిశ్రమలు కొత్తవి రాలేదని వున్న పరిశ్రమలను తరిమేస్తున్నాడన్నారు. 58 సంవత్సరాల్లో 16 మంది ముఖ్యమంత్రుల కాలంలో ఉమ్మడి రాష్ట్రంగా వున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో కేవలం కేవలం లక్ష కోట్ల రూపాయలు మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం అప్పు వుందన్నారు. 2014 నుండి 2018 వరకు చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కేవలం లక్షన్నర కోట్ల అప్పు మాత్రమే వుండేదని వైసిపి ప్రభుత్వం వచ్చాక 2019 నుండి ఈనాటి వరకు ఏడున్నర లక్షల కోట్ల రూపాయలు జగన్ ప్రభుత్వం అప్పులు చేసిందన్నారు. సంక్షేమ పథకాల పేరుతో అమ్మఒడి, ఆసరా, చేయూత వంటి పథకాలతో డబ్బులన్నీ నాన్న బుడ్డీకి వెళుతున్నాయన్నారు. ఇదంతా ఎలా వుందంటే చిన్నపిల్లాడికి చాక్లెట్ ఇచ్చి నక్లెస్ కొట్టేసినట్లు వుందన్నారు. ఈ ప్రభుత్వంలోని త్యావసరవస్తువులు, విద్యుత్ చార్జీలు తారాస్థాయికి చేరాయని జగన్ ప్రభుత్వంపై విరుచుకపడ్డారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఇటువంటివి గమనించి వైసిపికి సమాధి కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నిషార్‌అహమ్మద్, బాసినేని ప్రభాకర్, దేవేంద్ర, తాడిమర్రి మండల కన్వీనర్ పోతులయ్య, ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఏపీకి జగనే ఎందుకు కావాలంటే..!

- సంక్షేమానికి సారథి..పాలనా వ్యవస్థకు వారధి..! - నాడు-నేడుతో విద్యా,వైద్యం పరిపుష్టం..! - 'వైనీడ్ జగన్' కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి




కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

**తాడిపత్రి,నవంబరు9,ప్రభాతవార్త:**

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వాలంటీర్ల ద్వారా సంక్షేమాన్ని గడప గడపకు చేరుస్తున్నందుకు., సచివాలయాల ద్వారా పాలనా వ్యవస్థను గ్రామాలకు చేరుస్తున్నందుకు., నాడు-నేడుతో విద్య, వైద్యం పరిపుష్టం చేస్తున్నందుకు అంటూ తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి విశ్లేషించారు. నియోజకవర్గంలోని యాడికి మండల కేంద్రంలో 1వ సచివాలయంలో గురువారం ఆయన 'ఏపీకి జగనేఎందుకుకావాలి' అనే కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ప్రత్యక్ష లబ్ధి బదిలీ అనే వినూత్న విధానం ద్వారా లబ్ధిదారులకు పారదర్శకంగా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకున్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన అన్నారు. జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ పెన్షన్ కానుక, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ కళ్యాణమస్తు వంటి ప్రత్యక్ష లబ్ధిని చేకూర్చే 25 పథకాల ద్వారా, జగనన్న విద్యాకానుక, జగనన్న తోడు, ఇంటింటికి రేషన్ వంటి పరోక్ష లబ్ధిని చేకూర్చే మరో8పథకాలద్వారానియోజకవర్గంలోని ప్రజలకు రూ. కోట్ల లబ్ధిని చేకూరుస్తున్న ప్రభుత్వం మా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని కేతిరెడ్డి పెద్దారెడ్డి పేర్కొన్నారు. వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది వంటి పాలనా సౌలభ్య వ్యవస్థతోనూ, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, అంకితభావం కలిగిన కార్యకర్తలతో అటు ప్రభుత్వం, ఇటుపార్టీ రాష్ట్రంలో బలీయమైన శక్తులుగా అవతరించాయని పెద్దారెడ్డి పేర్కొన్నారు. సచివాలయాల వారీగా నియోజకవర్గంలోని మొత్తం 104 సచివాలయాల పరిధిలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాలను నిర్వహించి ప్రజల మద్దతు కోరతామని ఆయన అన్నారు. సమాజంలో అర్హులైన అందరు అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు, అవ్వాతాతలకు లంచాలకు, వివక్షతకు తావు లేకుండా పారదర్శకంగా సేవలందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఈఓఆర్డీ వెంకటేష్, సర్పంచి అనురాధ, ఈఓ ఎర్రిస్వామి, నాయకులు బొంబాయి రమేష్ నాయుడు, భోగాతి బ్రహ్మానందరెడ్డి, కాసా చంద్రమోహన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలు పట్టని వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వాన్ని శాశ్వతంగా ఇంటికి పంపుదాం

❖ టీడీపీ అధికారంలోకి వస్తే.. ఇచ్చిన ప్రతి హామీ నెరవేరుస్తాం

❖ బిసిల కోసం రక్షణ చట్టాన్ని ఖచ్చితంగా తీసుకొస్తాం

❖ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ మంత్రి పరిటాల సునీత



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**చెన్నేకొత్తపల్లి, నవంబర్ 9 ప్రభాతవార్త**

ప్రజల సమస్యలు ఏ మాత్రం పట్టించుకోని వైసీపీ ప్రభుత్వాన్ని శాశ్వతంగా ఇంటికి పంపుతామని మాజీ మంత్రి పరిటాల సునీత ప్రజలకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రమైన చెన్నే కొత్తపల్లి బిసి కాలనీల్లో స్థానిక నాయకులతో కలిసి బాబు షూరిటీ-భవిష్యత్తకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మ్యానిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. అలాగే ఏ ఇంట్లో ఎంత మందికి పథకాలు అందుతాయి. ఏడాదిలో ఎంత లబ్ది చేకూరుతుంది.. ఐదేళ్లకు ఎంత వస్తుందన్నది వివరించారు. గతంలో ఎప్పుడూ లేని ఆరు అద్భుతమైన పథకాలను టీడీపీ అందిస్తుందని ప్రజలకు వివరించారు. ఈ ప్రభుత్వంలో లాగా ఒక్కో పార్టీ వారికి ఒక్కో రకంగా, రాజకీయ కక్షలతో పథకాలు అందకుండా చేసే విధంగా తాము వ్యవహరించబోమన్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని సునీత స్పష్టం చేశారు. మరోవైపు బిసిలకు దేశంలో గతంలో ఏ పార్టీ ఇవ్వని విధంగా ఒక రక్షణ చట్టాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. వైసీపీ హయాంలో పేరుకు బిసిలకు పదవులు ఇస్తున్నామని చెబుతున్నారు కానీ.. వారికి జరిగిన న్యాయం ఏమీ లేదన్నారు. అంతే కాకుండా బిసిలపై దాడులు కూడా ఎక్కువగా జరిగాయన్నారు. అందుకే బిసిల రక్షణ కోసం చట్టాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు బిసిలకు దేశంలో గతంలో ఏ పార్టీ ఇవ్వని విధంగా ఒక రక్షణ చట్టాన్ని తీసుకొస్తున్నట్లు తెలిపారు. వైసీపీ హయాంలో పేరుకు బిసిలకు పదవులు ఇస్తునాన్మని చెబుతున్నారు కానీ.. వారికి జరిగిన న్యాయం ఏమీ లేదన్నారు. అంతే కాకుండా బిసిలపై దాడులు కూడా ఎక్కువగా జరిగాయన్నారు. అందుకే బిసిల రక్షణ కోసం చట్టాన్ని తీసుకొస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు రైతులకు ఏటా పెట్టుబడి సాయం కింద రూ.20వేలు అందించడమే కాకుండా ఎప్పుడు పంట నష్టపోయినా పరిహ్వారం అందిస్తామన్నారు. మరోవైపు మహిళల కోసం ఆర్టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఉచితంగా మూడు గ్యాస్ సిలెండర్లు, ప్రతి నెల 15 వందల రూపాయల ఆర్థిక సాయం, ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా వారందరికీ అమ్మకు వందనం పేరుతో ఆర్థిక సాయం చేయనున్నట్టు చెప్పారు. పరిశ్రమ స్థాపించి యువతకు ఉద్యోగాలిచ్చే చొరవ కూడా తమ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రజలు ఏ ప్రభుత్వం అయితే మంచి జరుగుతుందన్నది ఆలోచించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబులేసు, చెన్నేకొత్తపల్లి, టిడిపి మండల కన్వీనర్ ముత్యాలరెడ్డి, నాయకులు మాదం సూర్యనారాయణరెడ్డి, గేటు కిష్ట, కోళ్ల సూరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మోడీ, జగన్‌ను ఇంటికి పంపాలి

- తెలుగుదేశంకి ఓటు వేస్తే బిజెపికి ఓటు వేసినట్లే..
- కాంగ్రెస్ రాష్ట నేత తులసి రెడ్డి వెల్లడి



మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

**అనంతపురం, నవంబర్ 9 ప్రభాతవార్త బ్యూరో**

మరో నాలుగు నెలల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వాన్ని రాష్ట్రంలోని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ ఎంపి తులసి రెడ్డి అన్నారు. అనంతపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి పాలకులు పెట్రోల్, డీజిల్, ధరలను పెంచిందని అన్నారు. శాంతి భద్రతలను పరిరక్షించడంలో విఫలం చెందారని విమర్శించారు. ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలను పూర్తిగా బిజెపి పాలకులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వంత పాడుతోందని విమర్శించారు. రాష్ట్రంలో తెలుగుదేశానికి పవన్ కళ్యాణ్‌కు ఓటువేసి బిజెపికి వేసినట్టేనని ఆయన అన్నారు. ప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా కానీ బుందేల్‌ఖండ్ ప్యాకేజీగానీ ఇవ్వలేదని విమర్శించారు. కృష్ణ జలాల పునర్విభజన నోటిఫికేషన్‌తో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆయన అన్నారు. ఏపిపిఎస్సీ మాజీ అధ్యక్షులు సాకే శైలజానాథ్ మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాయలసీమలో వేలాది ఎ కరాలకు నీటి సమస్య ఎదురవుతుందని అన్నారు. అనంతపురం జిల్లాలో కరువు తనకు వస్తుందని చెప్పారు. వేరుశనగ పంట పూర్తిగా నష్టపోయిందని కనీసం నష్ట పరిహారం గురించి మాట్లాడే.. పరిస్థితి కూడా ఈ పాలకులు చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. హెచ్ఎల్‌సికి నీటిని నిలిపివేసే పరపిస్థితి ఉందని కెసికెనాల్ నుంచి కూడా నీరు రాదని ఇంత దారుణమైన పరిస్థితులు ఉన్న రాష్ట్ర ప్రభుత్వానికి కానీ సంబంధిత మంత్రులకు గాని కనీస ఆలోచన కూడా లేకుండా పోయిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దాదాగాంధీ, శంకర్, వాసు తదితరులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మాక్ పోలింగ్ నిర్వహించాలి

-జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి



కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

**అనంతపురం కలెక్టరేట్, నవంబర్ 9 ప్రభాతవార్త**

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మాక్ పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. గురువారం అనంతపురం నగరంలోని పాత ఆర్డీఓ కార్యాలయం కాంపౌండ్‌లో వున్న ఈవిఎం గోడౌన్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మాక్ పోలింగ్ ప్రక్రియను, ఫస్ట్‌లెవల్ చెకింగ్ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మాక్‌పోల్ ప్రక్రియలో 2 శాతం ఈవిఎంల పనితీరు పరిశీలన వుంటుందని, ఇందులో పోల్ చేసిన ఓట్లు సరిగా నమోదు అవుతున్నాయా లేదా అని తదితర వివరాలు పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. సిసి కెమెరాల నిరంతర పర్యవేక్షణ, భద్రతా ఏర్పాట్లు, పోలీసు బందోబస్తు పకడ్బంధీగా వుండాలని, ఈవిఎం మాక్ పోల్ ప్రక్రియ జరిగే గోడౌన్‌లోనికి ఎలాంటి సెల్‌ఫోన్లు అనుమతి లేదని తెలిపారు. ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియ బుధవారంతో సజావుగా ముగిసిందన్నారు. ఈ కార్యమ్రంలో ఆర్డీఓ గ్రంధి వెంకటేష్, ఫస్ల లెవల్ చెకింగ్ సూపర్‌వైజర్ రవీంద్ర, డిపిఓ ప్రభాకర్‌రావు, ఎన్నికల విభాగం డిప్యూటి తహశీల్దార్ కనకరాజు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి మసూద్‌వలి, కాంగ్రెస్ ప్రతినిధి ఎంఎండి ఇమాంవలి, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి గోపాల్‌గౌడ్, పాల్గొన్నారు.

# మా కొద్దు జగన్...మళ్ళి రావద్దు జగన్..కాలవ





మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ , పార్టీ శ్రేణులతో కలసి పథకాలు వివరిస్తున్న కాలవ

**డి.హిరేహాళ్ నవంబరు 9 ప్రభాతవార్త**

రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనంచేసి వ్యవస్థలను భ్రష్టు పట్టించి ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసి వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టేసిన వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి ఎందుకు కావాలని మాజీ మంత్రి, తెదేపా రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు ప్రశ్నించారు. గురువారం ఆయన డి.హిరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామంలో తెదేపా మండల కన్వీనర్ యు.హనుమంతరెడ్డి, మాజీ ఎంపీపీ నాగళ్ళి పుష్పావతి తెదేపా శ్రేణులతో కలసి బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన పార్టీ శ్రేణులతో కలసి గ్రామ సచివాలయం వద్దకు చేరుకుని వైకాపా ప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులతో కలసి చేపట్టనున్న వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంకు వ్యతిరేకంగా మా కొద్దు జగన్-మళ్ళి రావద్దు జగన్ అంటు ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాల వారిపై ఎధేచ్ఛగా వైసీపీ నాయకులు దాడులు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని అడుగడుగున అపహాశ్యం పాలుచేస్తూ దుర్మార్గమైన, అరాచకమైన పాలన సాగిస్తున్నందుకు జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంకు మరలా అవసరమా అన్న అంశన్ని ప్రజలు ఆలోచించాలని కాలవ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ రోజు వైసీపీ పార్టీ ప్రచారాన్ని ప్రభుత్వ యంత్రాంగంతో ప్రారంభించడం తెదేపా పూర్తిగా వ్యతిరేకిస్తోందని ప్రజాధనం సుమారు రూ.10కోట్లు వెచ్చించి బుక్‌లెట్లు ముద్రించిడం హేమమైన చర్యని కాలవ ధ్వజమెత్తారు. జగన్ మళ్ళి రావాలని సచివాలయాల్లో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, ఎండీఓలు, జిల్లా కలెక్టర్లను మొదులుకొని అందరిని ఈ కార్యక్రమంలో బాగస్వామ్యులను చేయడం పూర్తిగా అధికార దుర్వినియోగమని ఆయన విమర్శించారు. ప్రజల సొమ్ముతో పార్టీ పిచ్చి ప్రచారాన్ని చేసుకోవడం ఒక్క తెదేపానే కాదు ఈ రాష్ట్రంలో ఉన్న అన్నివర్గాల వారు, మేధావులు అందరు వ్యతిరేకిస్తున్నారని గతంలో పరిపాలన చేసిన ఏ పార్టీ ప్రభుత్వ ఉద్యోగులతో పార్టీ ప్రచార కార్యక్రమాలు చేయించలేదని జగన్‌కు పిచ్చి తారా స్థాయికిచేరి ఇలాంటి కార్యక్రమానికి తెరతీశాడని కాలవ మండి పడ్డారు. దీంతో రాష్ట్ర ప్రజలు నేడు చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిని చేసుకోవడానికి సంసిద్దులవుతున్నారని ప్రజాధనంతో పార్టీ కార్యక్రమం నడపడం తెదేపా ముక్తకంఠంతో కండిస్తున్నామని కాలవ చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళి ఎందుకు ఈ రాష్ట్రానికి రాష్ట్రాన్ని నాశనం చేసినందుకా, అమరావతిని ఆపివేసినందుకా, పోలవరాన్ని నిలిపి వేసినందుకా, కృష్ణ జలాల పునహ పంపిణీ ఉత్తర్వులను అడ్డుకోలేని నిర్వాకం వల్ల రాయలసీమ ఎడారి అవుతున్నందుకా, ప్రత్యేక హోదా ఊసెత్తతనందుకా ఎందుకావాలని జగన్ ఈ రాష్ట్రానికి ఆయన ఎద్దేవా చేశారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటికి తిరిగి తెదేపా సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు ప్రజలకు ఇస్తూ వచ్చే ఎన్నికలో తెదేపాను బలపరచాలనా ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీటు వదలని 'రాజా' సారు

కలెక్టరు ఆదేశాలు బేఖాతరు

అనంతపురం అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో జరగని బదిలీలు

డిప్యూటీ తహశీల్దార్‌గా రిలీవ్ కాకపోవడంతో చేరని మరో అధికారి




**అనంతపురం కలెక్టరేట్, నవంబరు 9, ప్రభాతవార్త**

అనంతపురం అర్బన్ తహశీల్దార్ కార్యాలయంలో కలెక్టరు ఆదేశాలు బేఖాతరు అవుతున్నాయి. అక్కడి డిప్యూటీ తహశీల్దార్ రాజా కలెక్టరు కార్యాలయంలో డిటిగా చేరాల్సి ఉంది. ఇంత వరకు చేరకపోవడంతో ఆయన స్థానంలో రావాల్సిన మరో అధికారి విధుల్లో చేరలేని పరిస్థితి నెలకొంది. ఇటీవల అనంతపురం తహశీల్దార్ కార్యాలయం అర్బన్, రూరల్ కార్యాలయాలుగా ప్రభుత్వం మార్చింది. అనంతపురం అర్బన్ తహశీల్దార్‌గా బాలకిషన్, రూరల్ తహశీల్దార్‌గా విజయలక్ష్మిలు నియమితులయ్యారు. అనంతరం మండల పాలన సవ్యంగా జరిగేందుకు రెండు మండలాలకు అన్ని స్థాయిల్లోను ఉద్యోగులను జిల్లా కలెక్టరు ఆదేశాలతో రెండు కార్యాలయాలకు కేటాయించారు. అందులో భాగంగా కేటాయించిన ఉద్యోగులందరూ ఆయా కేంద్రాల్లో చేరకపోవడంతో పలు పత్రికల్లో కథనాలు కూడా వచ్చాయి. దీనిపై కలెక్టరు సీరియస్ అయ్యారు. దీంతో ఆఘమేఘాలపై అందరూ వారి స్థానాల్లో చేరారు. కానీ అనంతపురం అర్బన్ తహశీల్దార్ కార్యాలయానికి డిప్యూటీ తహశీల్దార్‌గా ఇంకా రాజానే పని చేస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆయన స్థానంలో డిటిగా మారుతిప్రసాద్ చేరాల్సి ఉంది. అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో డిటిగా రాజా చేరాలి. కానీ ఇప్పటి వరకు అర్బన్ తహశీల్దార్ కార్యాలయం వదలకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కలెక్టరు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినా, ఆ ఆదేశాలు ఎందుకు అమలు చేయడం లేదో అర్థం కాని పరిస్థితి నెలకొంది. తాను సెలవుపై వెళ్లడానికైనా సిద్ధమే గాని, అర్బన్ డిప్యూటీ తహశీల్దార్‌గా వెళ్లనని రాజా పలువురి సిబ్బందితో బహిరంగంగా చెబుతున్నట్లు సమాచారం. ఆయా తహశీల్దార్ కార్యాలయాల్లో పనులు సవ్యంగా సాగాలంటే బదిలీపై వెళ్లాల్సిన వాళ్లు వెళ్లాలి, రావాల్సిన వాళ్లు రావాల్సి ఉంటుంది. కానీ రాజా కూర్చుని పట్టుకుని వేలాడుతుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీని వెనుక పలు అక్రమాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి బదిలీలు సవ్యంగా జరిగేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# యాక్షన్ సీక్వెన్సులతో ఆకట్టుకోనున్న 'టైగర్ 3'

టాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్, కత్రినా కైఫ్ హీరో హీరోయిన్లుగా ప్రముఖ నిర్మాణ సంస్థ యష్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తున్న భారీ చిత్రం టైగర్ 3.. మనీష్ వర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఈచిత్రం అత్యధిక యాక్షన్ సీక్వెన్సులున్న చిత్రంగా సరికొత్త రికార్డు క్రియేట్ చేసింది.. ఈసందర్భంగా దర్శకుడు మనీష్ శర్మ మాట్లాడారు.. టైగర్ 3లో ఇండియన్ సిల్వర్‌స్క్రీన్ బిగ్గెస్ట్ యాక్షన్ పెయిర్ టైగర్ పాత్రలో సల్మాన్‌ఖాన్, జోయా



పాత్రలో కత్రినా కైఫ్ నటించారని అన్నారు.. వారిద్దరి కథ, వారిద్దరూ కలిసినపుడు సంఘర్షణ ఉంటూనే వస్తుందన్నారు. వారి మధ్య బంధం పెరిగే కొద్ది ఈ సంఘర్షణ పెరిగిందేకానీ తగ్గలేదన్నారు.. టైగర్ 3లో ఈ సంఘర్షణ ఇంకా బలంగా కన్పించనుందని తెలిపారు.. అందుకు తగ్గట్టుగా యాక్షన్ సన్నివేశాలు మెప్పించనున్నాయని తెలిపారు.. హాలీవుడ్ యాక్షన్ సినిమాలకు ధీటుగా టైగర్ 3లో సన్నివేశాలు ఉంటాయన్నారు.. సినిమాలో సల్మాన్, కత్రినా పాత్రలు ఎదుర్కొనే సమస్యల్లో ఉండే తీవ్రత వల్ల సినిమా చాలా వేగవంతంగా సాగుతుందనాననరు.. ఈ మూవీలో 12 అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలు ఉన్నాయని, ఇవి ప్రేక్షకులను ఆకట్టుకుంటాయన్నారు. అద్భుతమైన క్లైమాక్స్ ఉంటుందని, టైగర్, జోయా ఫ్యాన్స్‌కు అయితే ఇదొక ట్రీట్‌లా ఉంటుందన్నారు. ఐమ్యాక్స్‌లో ఈ యాక్షన్ సీన్స్ అబ్బురపరుస్తాయని ఆయన తెలిపారు. యష్ రాజ్ ఫిల్మ్స్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతున్న టైగర్3 నవంబర్ 12న ప్రపంచ వ్యాప్తంగా, తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుందని తెలిపారు.




# 'అధర్వ' నుంచి 'చాంగు చాంగురే' పాట

కార్తీక్ రాజు, సిమ్రాజ్ చౌదరి , ఐరా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం అధర్వ.. ఈసినిమాకు మహేష్ రెడ్డి దర్శకత్వం వహించారు.. పెగ్గో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సుభాష్ నూతలపాటి నిర్మిస్తున్నారు.. ఇప్పటికే విడుదలైన టీజర్, సాంగ్స్‌కు మంచి స్పందన వచ్చింది.. ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తిచేసుకునన్న ఈచిత్రం రిలీజ్‌కు సిద్ధమైంది.. డిసెంబర్ 1న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది.. తెలుగుతోపాటు, తమిళ, కన్డ, మలయాళ భాషల్లో ఏకకాలంలో



విడుదలచేస్తున్నట్టు మేకర్స్ తెలిపారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన చాంగు చాంగురే.. పాటను టాలీవుడ్ స్టార్ హీరోయిన్ శ్రీలీల విడుదల చేశారు.. శ్రీచరణ్ పాకాల సంగీతం అందించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం, యామినీ ఘంటసాల గాత్రం, భాను మాస్టర్ కొరియోగ్రఫీ పాటకు అందాన్ని తీసుకొచ్చాయి.. చూడటానికి, వినటానికి ఈ పాట ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. సస్పెన్స్ క్రైమ్ జానర్లో మూవీ అంటే ఆడియెన్స్‌కు ఎపుడు ఓ ఇంట్రెస్ట్ ఉంటుంది.. ఈ రెండు జానర్లకు రొమాంటిక్, లవ్ ట్రాక్‌ను జతపరిచి యూత్‌ను ఆకట్టుకునేలా అధర్వ చిత్రం రూపొందింది.. ఈచిత్రంపై భారీస్థాయిలో అంచనాలున్నాయి,.

# త్వరలో 'కాలింగ్ సహస్ర' సందడి: సుధీర్

బుల్లితెర ప్రేక్షకులను అలరించి, తిరుగులేని ఇమేజ్‌ను సంపాదించుకున్న సుడిగాలి సుధీర్ ఇపుడు వెండితెరపై ఆడియెన్స్‌ను మెప్పించనున్నారు.. గాలోడు బ్లాక్ బస్టర్ తర్వాత ఆయన నటించిన తాజా చినతరం కాలింగ్ సహస్ర.. షాడో మీడియా ప్రొడక్షన్స్ , రాధా ఆర్ట్స్ పతాకంపై అరుణ్ విక్కరాలా దర్శకత్వంలోరాబోతోంది.. విజేష్ తయాల్, చిరంజీవి పమిడి, వెంకటేశ్వర్లు కాటూరి ఈసినిమాను నిర్మించారు.. సుధీర్ సరసన డాలిషా హీరోయిన్‌గా నటిస్తోంది. టివి షోస్‌లో నవ్వించిన సుధీర్ , గాలోడు చిత్రంలో మాస్ హీరోగా ఆకట్టుకునానరు.. అయితే ఈసారి మరో



డిఫరెంట్ అటెంప్ట్ చేస్తున్నారు.. తాజాగా ఈసినిమా పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తిచేసుకుంది. తాజాగా ఈసినిమా నుంచి కనుల నీరు రాలదే.. అనే లిరికల్ సాంగ్‌ను విడుదల చేశారు.. నిర్మాత విజేష్ తయల్ మాట్లాడుతూ, ఈ పాటకు మెహిత్ మంచి సంగీతం అందించారని తెలిపారు.. తప్పకుండా అందరికీ నచ్చుతుందనాననరు.. దర్శకుడు అరుణ్ చాలా కాలంగా తెలుసు అని అన్నారు. ఈసినిమాను చాలా జాగ్రత్తగా తెరకెక్కించారని తెలిపారు. బెకనకం వేణుగోపాల్‌గారు ఇపుడు మా టీంలో ఓ మెంబర్ అయ్యారని తెలిపారు. సుధీర్‌గారితో మంచి జర్నీ అన్నారు. దర్శకుడు అరుణ్ మాట్లాడుతూ, కాలింగ్ సహస్ర తర్వాత సుధీర్ రేంజ్ తర్వాతి లెవల్‌కు చేరుతుందని పేర్కొన్నారు. తనొక మంచి స్టార్ అవుతారని తెలిపారు. కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ శశికిరణ్, హీరోయిన్ డాలీషా, సంగీత దర్శకుడు మోహిత్, నిర్మాత విజేష్ తయల్, రామచంద్రరావు, బెక్కం వేణుగోపాల్ , హీరో సుధీర్ తదితరులు మాట్లాడారు.

# సుమన్ ప్రధాన పాత్రలో..

పాటల రికార్డింగ్‌తో సినిమాకు శ్రీకారం చుట్టటం అనే సంప్రదాయాన్ని ఇటీవల మెగాస్టార్ చిరంజీవి జీవం పోసిన సంగతి తెలిసిందే.. తాను నటిస్తునన 156 వ చిత్రాన్ని కీరవాణి సారథ్యంలోపాటల రికార్డింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే బాటలో ఇపుడు యువ దర్శకుడు ఆర్‌కె గాంధీ తన తాజా చిత్రాన్ని ప్రారంభించారు. . సీనియర్ హీరో సుమన్ ప్రధాన పాత్రలో త్రిష చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు యువ ప్రతిభాశాలి ఆర్ కె గాంధీ .స్నేహాలయ



క్రియేషన్స్ , బిఆర్ మూవీస్ పతాకంపై రవీంద్రబాబు బూసం, ఈశ్వర్ నాగనాథ్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈచిత్రానికి సమర్పణ కిరణ్ కుమార్ గుడివల్లి హనుమంత రాయప్ప లైన్ ప్రొడ్యూసర్. యువ సంగీత సంచలనం ఎంఎల్ రాజా సంగీతం అందిస్తున్నారు.. సాహిత్యం కూడ ఆయన సమకూర్చారు.. త్రిష చిత్రం కోఎసం యువగాయకుడు సాయిచరణ్ ఆలపించిన గీతాన్ని అభేరి స్టూడియోలో రికార్డింగ్ చేశారు. ఈనెల 14వ తేదీ నుంచి హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది. కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఒక దివ్యాంశ సంభూతుడు దుష్ట శక్తులను ఎలా అరికట్టాడు, అనే కథాంశంతో తెరకెక్కుతోందని తెలిపారు. కాలకేయ ప్రభాకర్ , సురేష్ సూర్య, ఖుషీ గౌడ్, యువీన తదితరులు నటిస్తున్నారు.

# 'పిండం' పాట విడుదల

ప్రముఖ హీరో శ్రీకాంత్ శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటిస్తున్న చిత్రం పిండం.. ఈసినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్‌కుమంచి స్పందన వచ్చింది.. ఇపుడు ఈచిత్రం నుంచి జీవ పిండం అనే పాటను విడుదల చేశారు.. పాటను



ఆవిష్కరించిన అనంతరం ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడారు.. పిండం చిత్రం చూశానని, అద్భుతంగా ఉందన్నారు.. సాంగ్‌ను లాంచ్ చేయటం ఆనందంగా ఉందన్నారు. సాంగ్ కూడ చాలా బాగుందన్నారు. పాటలోనే కథ ప్రయాణం ఎలా ఉండబోతుందో చెప్పారని తెలిపారు. ఎంతో ఆసక్తిగా ఉందన్నారు. మేకర్స్ మాట్లాడుతూ, ఈచిత్రం కంప్లీట్ హారర్ చిత్రంగా ఉంటుందన్నారు. ఇంతటి భయానక హారర్ చిత్రాన్ని టాలీవుడ్ ఇంతవరకూ చూడలేదని అన్నారు..

# 'సప్తసాగరాలు దాటి సైడ్ బి' మెప్పిస్తుంది: యూనిట్

ఈ ఏడాది సెప్టెంబర్‌లోవిడుదలైన సప్తసాగరాలు దాటి సైడ్‌ఎ' విశేష ఆదరణ పొందింది.. దీంతో సైడ్..బి.. కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.. కన్నడలో రూపొందిన ఈచిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ , వివేక్ కూచిబొట్ల తెలుగు ప్రేక్షకులకు అందిస్తున్నారు.. హేమంత్‌రావు దర్శకత్వం వహించారు. ఈచిత్రంలో రక్షిత్ శెట్టి, రుక్మిణి వసంత్ మరియు చైత్ర జె. ఆచార ప్రధాన పాత్రల్లో నటించారు. ఈసినిమా నవంబర్ 17న విడుదల కానుంది.. ఈనేపథనయంలోతాజాగా యూనిట్ మీడియాతో మాట్లాడింది.. దర్శకుడు కెవి అనుదీప్, శ్రీనివాస్ అవసరాల పాల్గొన్నారు., రక్షిత్ శెట్టి, చిత్ర హీరోయిన్ రుక్మిణి వసంత్, చైత్ర కె..ఆధార్, చిత్ర దర్శకుడు హేమంత్‌రావు, నిర్మాత వివేక్ కూచిబొట్ల,నటుడు, దర్శకుడు శ్రీనివాస్ అవసరాల, దర్శకుడు కెవి అనుదీప్ తదితరులు మాట్లాడారు.



# మంచి చిత్రాన్ని చూశామనే ఫీలింగ్: దినేష్ తేజ్

దినేష్ తేజ్, హెబ్బాపటేల్, పాయల్ రాధాకృష్ణ హీరోహీరోయిన్లుగా రాబోతున్న మంచి ఫీల్‌గుడ్ మూవీ అలా నిన్నుచేరి... ఈమూవీని విజన్‌మూవీ మేకర్స్ బ్యానర్‌పై కొమ్మాలపాటి శ్రీధర్ నిర్మిస్తున్నారు.. అన్ని రకాల ఎమోషన్స్ జోడించి ఈమూవీని మారేష్ శివన్ తెరకెక్కించారు.. కొమ్మాలపాటి సాయిసుధాకర్ నిర్మించారు.. ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్ పాటలు రాశారు. సుభాష్ ఆనంద్ సంగీతం అందిస్తున్నారు.. ఈచిత్రం నవంబర్ 10న విడుదల కానుంది. ఈనేపథ్యంలో హీరో దినేష్ తేజ్ మీడియాతో మాట్లాడారు. ఆయన మాటల్లోనే..



అలా నిన్నుచేరి.. అంటూ కొత్తగా ప్రయత్నించాను. కమర్షియల్ రోల్‌ను పోషించాను.. అందరికీ నచ్చుతుందని భావిస్తున్నాను.. ప్రతి ఒక్క మిడిల్ క్లాస్ అబ్బాయికి ఎదురయ్యే సంఘర్షణ ఇందులో ఉంటుంది.. ప్రేమ ముఖ్యమా? లక్ష్యం ముఖ్యమా? అన్నదిచూపిస్తాం.. ఆ పాయింట్ నాకు ఈసినిమా చేయటానికి స్ఫూర్తినిచ్చింది. కరోనా టైంలో వచ్చిన ప్లే బ్యాక్ వల్ల మంచి పేరొచ్చింది.. మంచి రివ్యూలు వచ్చాయి. నాకు మంచి ప్రశంసలు దక్కాయి. ఆ తర్వాత ఓచిత్రం థియేటర్‌లోకి వచ్చింది . కానీ అంతగా మెప్పించలేకపోయింది.. ఇపుడు ఈచిత్రంతో ఎలాంటి ప్రశంసలు వస్తాయో చూడాలి. ఇండస్ట్రీలో అందరికీ కష్టాలుంటాయి.. కానీ మన వద్దకు వచ్చే స్క్రిప్టులను జాగ్రత్తగా ఎంచుకోవాలి.. జనాలకు నచ్చే కథల్లో కన్పించాలి. హెబ్బాపటేల్ గురించి చెప్పాల్సిన పని లేదు.. ఆమె అద్భుతంగా నటించింది.. సెట్‌లో ఆమె ఎంతో ఫ్రెండ్లీగా ఉండేవారు.. పాయల్ నటన గురించి ఇపుడు ప్రేక్షకులు తెలుసుకుంటారు.. మా ముగ్గురి మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరింది.. చంద్రబోస్‌గారు రాసిన పాటలు అద్భుతంగా వచ్చాయి.. మా సినిమాకు పాటలు రాస్తున్న టైంలోనే ఆయనకు ఆస్కార్ అవార్డు లభించింది. మా డైరెక్టర్ మారేష్ శివన్‌గారు హుషారు సినిమాకు ఆర్ట్‌డైరెక్టర్‌గా పనిచేశారు.. ఆమూవీ అయిన ఏడాదికి నా వద్దకు వచ్చి ఈ ప్రాజెక్టు గురించి చెప్పారు.. కథ నాకు ఆల్‌రెడీ తెలుసు కాబట్టి వెంటనే ఓకే చెప్పాను..


